క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి : బలాల



క్యాన్సర్ స్ర్కీనింగ్ శిబిరంలో ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణారెడ్డి

సైదాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీ అధ్యక్షుడు మడిగల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య బృందం ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య నిపుణులు ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించి సమాజాన్ని రక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంకాలజీ వైద్యులు సుధాకర్, తస్నీం, సుధాకర్ రెడ్డి, ప్రవలిక, రెడియాలజిస్ట్ సిమ్రాన్, అబ్దుల్, మేనేజర్ లక్ష్మణ్, బిందు తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్ ప్రారంభించి చిన్నారులతో సరదాగా కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

సీఎం సహకారంతో లింగోజిగూడ అభివృద్ధి

ఎల్బీనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో లింగోజిగూడ డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని జ్యోతిక్లబ్ వద్ద నిర్మించిన ఓపెన్ జిమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కామేశ్వర్‌కాలనీ, కుమార్‌గల్లీ, త్రిమూర్తికాలనీ, బాలాజీకాలనీ, గణేష్‌నగర్, బృందావన్ కాలనీల సభ్యులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అసిత్ సహకు పుష్పగుచ్ఛం, వినతిపత్రం ఇస్తున్న మహేష్ తదితరులు

పాత పద్ధతిలోనే కేడర్-యూ పోస్టులు భర్తీ చేయాలి

మన్సూరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జీఎస్ఐ సంస్థలోని కేడర్-యూలోని స్టోర్స్ విభాగంలో పోస్టుల కొరతతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పాత పద్ధతి ద్వారానే పోస్టులను భర్తీ చేయాలని జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ చైర్మన్ ఆదర్ల మహేష్ కోరారు. నాగోల్ బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా జీఎస్ఐ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ జనరల్ అసిత్ సహకు బండ్లగూడ జీఎస్ఐ హెచ్ ఓడీ హరమోహన్ మిశ్రా సమక్షంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జీఎస్ఐలో ఏపీఎండీ కేడర్‌ను పునర్నిర్మాణ సమీక్షకై సహకరించాలని, అదేవిధంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియర్ కార్యదర్శి జె.రాజశేఖర్, స్టోర్స్ అధికారులు, ఉద్యోగులు గోపాల శ్రీనివాసరావు, లింగయ్య, అరుణ్ కుమార్, అమర్, మేఘ్‌రాజ్, సునీల్‌కుమార్, శివశంకర్, తదితరులు ఉన్నారు.



మానస సంస్థలో మానసిక దివ్యాంగ పిల్లలతో ఒరాకిల్ బృందం

దివ్యాంగ పిల్లల సామర్థ్యాన్ని సవాళ్లనూ గుర్తించాలి

కొత్తపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగ పిల్లల సామర్థ్యాన్ని సవాళ్లనూ గుర్తించాలని ఒరాకిల్ ఇండస్ట్రియల్ గ్లోబల్ ఇన్‌వెస్ట్‌మెంట్ యూనిట్ హైదరాబాద్ సీనియర్ డైరెక్టర్ ప్రతీక్ పరాశర్ సూచించారు. కార్పొరేట్ వాలంటీరింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం 30 మంది ఒరాకిల్ ఉద్యోగుల బృందం కొత్తపేటలోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థలో చిన్నారులతో ఆటలాడి, మొక్కలు నాటిస్తూ గడిపారు. సంస్థలో మానసిక దివ్యాంగ చిన్నారులకు నిర్వహించే ప్రత్యేక తరగతులు, ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, బిహేవియోరల్ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిట్ మేనేజర్లు గురుగేందర్ సింగ్, డి.వాహిద్, వై.మురళీధర్, టీం లీడర్ ఎం.రామపండరినాథ్, నమ్రత, వినీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రభుత్వ సహాయ న్యాయవాదుల శిక్షణ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో గత మూడురోజులుగా ప్రభుత్వ సహాయ న్యాయవాదులకు నిర్వహించిన శిక్షణాతరగతులు శనివారం ముగిశాయి. ది అడ్వొకేట్స్ మ్యుచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కోర్టు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక హాజరై మాట్లాడారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయ సంరక్షణలో న్యాయవాదులకు, న్యాయమూర్తులకు సహకారంగా ఉంటూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్, సభ్యులు రాజేందర్ రెడ్డి, మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

● చిన్నారులకు బలవర్ధక ఆహారం అందజేత



విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తి పెంచి వివిధ రకాల వైరస్, బ్యాక్టీరియా నుంచి రక్షణ కల్పించేందుకుగాను డాబర్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా డాబర్ చ్యవన్ ప్రాశ్ బలవర్ధక ఆహారం అందజేశారు. సంస్థ ప్రతినిధులు దినేశ్‌కుమార్, శ్రీరామ్ పద్మనాభన్, డాక్టర్ ప్రసాద్, ఉపాధ్యాయులు అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

- సరూర్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి)

● యూత్ కాంగ్రెస్ నేతకు స్వాగతం



రాష్ట్ర పర్యటన నిమిత్తం శనివారం హైదరాబాద్‌కు చేరుకున్న యూత్ కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జి మనీష్‌శర్మకు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి తదితరులు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

- సరూర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)

సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

- ఆశావాహులతో ప్రధాన పార్టీల పెద్దల సమావేశాలు
- గెలుపు గుర్రాల వైపు మొగ్గు
- డిసెంబరు 3 నుంచి నామినేషన్ ప్రక్రియ షురూ



అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. మూడో విడతలో భాగంగా డిసెంబరు 3 నుంచి మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. డిసెంబరు 5 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను అధికారులు స్వీకరించనున్నారు. నామినేషన్ల దాఖలుకు సమయం దగ్గర పడుతుండడంతో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులలో అలజడి మొదలైంది. పార్టీ పెద్దల అండదండల కోసం వేచిచూస్తున్నారు. వారి మెప్పు కోసం తాపత్రయపడుతున్నారు. పార్టీ నుంచి అభ్యర్థిగా తననే బలపర్చేలా చూడాలని ఆశావాహులు గ్రామంలోని ఆయా పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పార్టీ సమావేశాలతో సందడి

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మరో 3 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఆయా ప్రధాన పార్టీల సమావేశాల సందడి నెలకొంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపిక కోసం ఆయా పార్టీల గ్రామ పెద్దలతో కలిసి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు వ్యవసాయ బావులు, గ్రామ దేవతల గుళ్ల వద్ద సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆశావాహుల నుంచి సర్పంచ్, వార్డు అభ్యర్థుల పేర్లను స్వీకరిస్తున్నారు. గ్రామంలో పేరు, ప్రతిష్ఠలతో పాటు అభ్యర్థుల పలుకుబడిని గుర్తించి ఎవరిని బరిలో నిలబెట్టాలనే దానిపై గ్రామ స్థాయిలోనే కసరత్తు ప్రారంభించారు. అయితే, పోటీ చేసే అభ్యర్థులు ఎక్కువగా ఉంటే నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వారు వినకుంటే నియోజకవర్గ స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లి సముదాయించే ప్రయత్నాలు ప్రారంభించారు.

వార్డు స్థానాలకు పెరిగిన పోటీ

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 134 వార్డులు ఉన్నాయి. సర్పంచ్‌గా పోటీ చేయాలంటే లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా సర్పంచ్ కంటే వార్డు సభ్యుడిగా పోటీ చేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. వార్డు సభ్యుడిగా ఎంతోకొంత ఖర్చుపెట్టి గెలిచిన, ఓడిన ఫరక్ పడదని... లక్షలు ఖర్చు చేసి సర్పంచ్‌గా ఓడిపోతే ఆ తర్వాత పరిస్థితి ఎంటన్న ఆలోచనలో ఎక్కువమంది ఆశావాహులు పడినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో ఒక్క వార్డుకు ఒకే పార్టీ నుంచి సుమారు ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా మండలంలో నామినేషన్ల స్వీకరణకు సమయం దగ్గర పడుతుండడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది.

దీక్షా దివస్‌తో మిలియన్ల హృదయాలు ఒక్కటయ్యాయి

● ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హయత్‌నగర్‌లో పేదలకు పండ్లు, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

హయత్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్‌తో మిలియన్ల హృదయాలు ఒక్కటయ్యాని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కేసీఆర్ చిత్ర పటానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి కేసీఆర్ 2009 నవంబరు 29న దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. అదే రోజు తెలంగాణాలో ఉద్యమ జ్వాల పుట్టిందని అన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో దీక్ష చేసి తెలంగాణ సాధించారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి, బంజారాకాలనీ, ఓల్డ్ విలేజీ, అంగన్‌వాడీ కేంద్రాలలో పేదలకు పండ్లు, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తిరుమల్‌రెడ్డి, శ్రావన్‌కుమార్, భాస్కర్ సాగర్, మల్లీశ్వరీరెడ్డి, అంజలీ, స్కైలాబ్, రమేష్, ప్రదీప్, రాకేష్, సత్తిరెడ్డి, శ్రీకాంత్, రాధిక, లక్ష్మణ్, ఇంద్రకరణ్, మధు, నగేష్, బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించేలా కృషి

- రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్
- ఘనంగా ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ సన్మాన సభ



ఎంపీ అనిల్‌యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, వర్రె వెంకటేశ్వర్లును సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న ఏబీవైఎంఎస్ సభ్యులు

మన్సూరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అందుకు తమవంతుగా కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ (ఏబీవైఎంఎస్) ఆధ్వర్యంలో శనివారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో యాదవ సామాజిక వర్గం నుంచి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఇటీవల ఎన్నికైన నవీన్ యాదవ్‌కు ఆత్మీయ సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్, గౌరవ అతిథిగా పోలీస్ కంప్లైంట్ అథారిటీ రాష్ట్ర సభ్యుడు, ఆర్టీఐ మాజీ చీఫ్ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌ను ఏబీవైఎంఎస్ ఆధ్వర్యంలో అతిథులు ఘనంగా సన్మానించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు సంఘటితంగా ఉంటే ఏదైనా సాధ్యమని, యాదవుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశం, జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవ చేస్తూ యాదవ బిడ్డగా బాధ్యతలు చేపడతానని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ అనిల్‌యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌లను శాలువాలు, గజమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఏబీవైఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నేత చిన్నశ్రీశైలం యాదవ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మయాదవ్ ఏబీవైఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు యశ్వంత్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రాజేందర్ యాదవ్, యాదవులు, వివిధ పార్టీల యాదవ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

బీసీలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్

● బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రిజర్వేషన్ కల్పించకుండా బీసీలను వెన్నుపోటు పొడిచిందని బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 14శాతం రిజర్వేషన్లను మాత్రమే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎల్బీనగర్ బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఎల్బీనగర్ మహనీయుల విగ్రహాల వద్ద ఆందోళన చేపట్టారు. ముఖ్యఅతిథిగా సామ రంగారెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి బీసీల హక్కులు సాధించే వరకు బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేపడుతోందని ఆయన అన్నారు. ఆందోళన చేపడుతున్న బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్ యాదవ్, కార్పొరేటర్ పవన్ కుమార్, నాయకులు గీతారెడ్డి, శ్రీనివాస్ రావు, సుందర్ నారాయణ, శ్యాం, రాజేష్, మల్లేష్ గౌడ్, కవితారెడ్డి, పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్‌కు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి

చాదర్‌ఘాట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలకు నిరసనగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడాన్ని నిరసిస్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మలక్‌పేట పోలీసులు రంగంలోకి దిగి సీఎం దిష్టి బొమ్మ దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, కోర్టులను కారణంగా చుపుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీమోర్చా నాయకులు చందు, ప్రదీప్, నర్సింహ, నరేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు దినేష్‌పటేల్, జిల్లా నాయకులు దేవేందర్, హరిగౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కేటాయించి కూల్చివేతలు చేపట్టండి



మార్కింగ్ చేసిన ఇంటి వద్ద ఐక్యవేదిక మహిళా విభాగం బృందం

చాదర్‌ఘాట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మూసానగర్ బస్తీలో బాధిత కుటుంబాలకు స్థానికంగా ఇళ్లను కేటాయించిన తర్వాతే మార్కింగ్ చేసిన 36 ఇళ్లను కూల్చివేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు జె.ఇందిర రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక మహిళా విభాగం బృందం మూసానగర్ బస్తీలో మార్కింగ్ చేసిన నిరుపేదల ఇళ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం అంబర్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది మూసానగర్ బస్తీలోని మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న 36 ఇళ్లకు రెడ్ మార్కింగ్ చేసిందని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది నోటి మాటగా ఇళ్లను కేటాయిస్తామని, లేదంటే ఎంత స్థలంలో ఇల్లు ఉందో అంత స్థలానికి డబ్బులను నష్టపరిహారంగా చెల్లిస్తామని చెప్పి రెడ్ మార్కింగ్ చేశారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ నిరుపేదల ఇళ్లను కూల్చకుండానే మూసీ సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో ఇళ్లను కూల్చివేయాల్సి వస్తే ముందుగానే వారికి నూతన ఇళ్లను కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

సైదాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ పెద్దతోట హాల్‌లో గుర్రం శశిధర్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు, ఇతర స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై భజనలు చేశారు. అనంతరం పడి వెలిగించి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్తకాపు రవిందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యప్ప పడి వెలిగిస్తున్న స్వాములు



జీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను తిలకిస్తున్న ఏవీపీ ఇంజనీరింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టి వర్క్స్ అధినేత ఆదిత్య రవి శంకర్

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

హయత్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని జీ స్కూల్‌లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సొంతంగా తయారు చేసిన దాదాపు వందకు పైగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా రోబోటిక్, రాడార్ పని తీరు, ఫోరెన్సిక్ లాబ్‌లో కెమిస్ట్రీ ఉపయోగపడే తీరును, కల్చర్‌పైన ఫిజిక్స్, బయోలాజీ, మ్యాథమాటిక్స్‌పై వివిధ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏవీపీ ఇంజనీరింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టి వర్క్స్ అధినేత ఆదిత్య రవి శంకర్ హాజరై విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. అత్యున్నత ప్రదర్శనలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్లు, అనంతరెడ్డి, సుదర్శనరెడ్డి, నాగేంద్రబాబు, సీఈవో గిరిజారెడ్డి, ప్రిన్సిపాల్ పూర్ణా శ్రీవత్సవ్‌లు పాల్గొన్నారు.

రాజేష్‌కు శ్రీసత్యసాయి సేవా పురస్కారం



కళారత్న కృష్ణకుమారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న రాజేష్

ఎల్బీనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఅవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌ను శ్రీసత్యసాయి సేవా పురస్కారం వరించింది. భగవాన్ శ్రీసత్యసాయి 100వ జయంతి ఉత్సవాల సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో నగరంలోని త్యాగరాయ గానసభలో పలు రంగాల్లో సేవలందిస్తున్న వారికి సత్యసాయి సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడిగా సేవలందిస్తున్న మార్గం రాజేష్‌కు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కళారత్న డా.కేవీ కృష్ణకుమారి సత్యసాయి సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ రామచంద్రరావు, సినీ దర్శకులు మాగంటి ప్రసాద్ బాబు, కుసుమ ధర్మన్న, కళాపీటం అధ్యక్షుడు డా.రాధకుసుమ పాల్గొన్నారు.

మీర్‌పేట్ మెయిన్ రోడ్డులో వైన్స్ ఏర్పాటు చేయొద్దు



మీర్‌పేట్- అల్మాస్‌గూడ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేయనున్న వైన్ షాప్ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు, ఇతరత్రా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున సదరు వైన్ షాప్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దంటూ సీఐటీయూ నాయకులు దాసరి బాబు తదితరులు శనివారం సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు, మీర్‌పేట్ మునిసిపల్ అధికారులకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.

- సరూర్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)



హోమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

వైభవంగా నవచండీ హోమం, రుద్రయాగం

సరూర్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మీర్‌పేట్‌లోని తన ఇంజనీరింగ్ కాలేజీ క్రికెట్ మైదానంలో శనివారం నవచండీ హోమం, సుదర్శన లక్ష్మీసహిత రుద్రయాగాలను వైభవంగా నిర్వహించారు. తన సతీమణి అరుంధతి, కుమారులు తీగల హరినాథ్‌రెడ్డి-అనితారెడ్డి దంపతులు, తీగల అమర్‌నాథ్‌రెడ్డి- తులసీరెడ్డి దంపతులు, కూతురు హరితారెడ్డి తదితరులతో కలిసి ఆయన ఈ ఆధ్యాత్మిక క్రతువు నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో మేడ్చల్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, ప్రకాశ్ గౌడ్, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. అతిథులందరికీ తీగల కృష్ణారెడ్డి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.